

PRATHAM
BOOKS

# మహిమగల పొడి మ్యాన్మార్ దేశ జానపద కథ

**Author:** Greystroke
**Illustrator:** P.G. Dinesh
**Translator:** Balaji Maddikera

చదువుట దశ **3**

Scanned with CamScanner

అనగనగా ఇర్రవడ్డీ (ఇరావతి) నదీతీరంలో ఉన్న ఒక కుగ్రామంలో తూజ అనే ఒక యువతి నివసించేది. ఆమె తేంగి అనే ఒక అందమైన యువకుని పెళ్ళాడి హాయిగా జీవించేది.

కానీ తూజను ఒక సమస్య వేధించేది - తన భర్త తానొక రసవాదిని - అంటే మట్టి, లోహాల నుంచి బంగారం చేయగల శక్తి కలవాడిని అని నమ్మేవాడు. అందుకే మట్టినుండి బంగారం చేయడం ఎలాగా అని ఎప్పుడూ కలలు కంటూ గడిపేవాడు.

అతను ఏదో ఒక ఆవిష్కారం సాధించాలని ఎన్నో రోజులు, పగలూ రాత్రి ప్రయత్నిస్తూ, ప్రయోగాలు చేస్తూ ఉండేవాడు. కొన్ని రోజులకే వారి దగ్గర డబ్బు అయిపోయింది. వారిద్దరి తిండి కోసం తూజా నానా కష్టాలూ పడేది. తూజా బాగా దిగులు పడింది.

ఆమె తన భర్తతో ''నీవు త్వరగా ఒక ఉద్యోగం సంపాదించాలి. మనమిలా ఎక్కువకాలం గడపడం కష్టం,'' అన్నది.



Scanned with CamScanner

కానీ తేంగి వినిపించుకోలేదు. ''నేను ఒక ఆవిష్కారానికి దగ్గరలో ఉన్నాను! మనం ఊహించని రీతిలో ధనవంతులం కాబోతున్నపుడు నేనెందుకు పనిచేయాలి? త్వరలో మనం దొరికిన మట్టి అంతా బంగారంగా మార్చగలుగుతాం చూస్తుండు,'' అన్నాడు.

ఏం చేయాలో అర్థం కాక బరువైన గుండెతో తూజ తన తెలివైన తండ్రి థెట్ వద్దకు పరిష్కారం కోసం వెళ్ళింది. తన అల్లుడు రసవాది అని తెలిసి థెట్ ఆశ్చర్యపోయాడు.

అతను కొద్దిసేపు ఆలోచించి తేంగిని కలవాలన్నాడు. ఆ రోజు తూజ చాలా సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెకు తెలుసు తన తండ్రి దగ్గర ఏదో ఒక పరిష్కారం ఉంటుందని.



Scanned with CamScanner





Scanned with CamScanner

ఆ మరుసటి రోజు తేంగి మామగారి ఇంటికి వెళ్ళాడు. తనకు చీవాట్లు పడక తప్పదు అనుకున్నాడు. కానీ థెట్ అతనిని ప్రక్కకు పిలిచి ''నేను కూడా వయసులో ఉన్నపుడు ఒక రసవాదినే!'' అని చెప్పినపుడు ఆశ్చర్యపోయాడు. ఆ ఇద్దరూ ఆ మధ్యాహ్నమంతా తేంగి సాధన గురించి మాట్లాడుకున్నారు. చివరిగా ఆ వృద్ధుడు లేచి నిలబడి ''తేంగి నేను నీ వయసులో ఉన్నపుడు చేసినట్టే నీవు అన్నీ చేస్తున్నావు. నీవు తప్పక ఆవిష్కారానికి అతి దగ్గరలో ఉన్నావు. !

కానీ నీవు నీ ప్రయోగాలలో ఒక ముఖ్యమైన పదార్థం మరచిపోతున్నావు. నీవు మట్టినుంచి బంగారం తయారుచేసినపుడు ఇది అవసరం. నేను ఈ మధ్యనే ఇది తెలుసుకున్నాను. కానీ నాకు వయస్సు పైబడింది. దీనికి చాలా శ్రమ అవసరం...'' అన్నాడు.

''అయితే మీ బదులు నేను చేస్తాను మామా!'' అని తేంగి ఉత్సాహంగా అన్నాడు. అతను నిజంగా ఉత్సాహంగా ఉన్నాడు. తన కలలన్నీ చివరకు ఫలిస్తున్నాయి. ''చెప్పండి ఆ అవసరమైన పదార్థం ఏదో!''

''నీవు ఉత్సాహంగా ఉన్నావు, మంచిదే!'' అన్నాడు థెట్. అతను ముందుకు వ్రాలి గుసగుసలాడాడు, ''అల్లుడూ, వెండి రంగులో ఉండే ఒక పొడి ఆ అత్యవసరమైన పదార్థం. అది అరటి ఆకులపైన మాత్రమే ఉంటుంది. నీవే అరటి మొక్కలను నాటి, రహస్య మంత్రాలు చదువుతూ పెంచాలి. ఆ మొక్కలు పెరుగుతూండగా దాని ఆకులపై ఉండే ఆ వెండి పొడికి మహిమ వచ్చేస్తుంది.''



Scanned with CamScanner





Scanned with CamScanner

''ఈ పొడి ఎంత అవసరమౌతుంది మామా?'' అన్నాడు తేంగి ఉత్సాహంగా. ''ఒక కిలో'' అన్నాడు థెట్.

''ఒక కిలోనా!'' అన్నాడు తేంగి హతాశుడై. ''అందుకు వందలకొద్దీ అరటి మొక్కలు అవసరమౌతాయి కదా!''

''అవుననుకుంటా అల్లుడూ'' అన్నాడు ఆ వృద్ధుడు. ''అందుకే నేను ఆ పనిని పూర్తిచేయలేను...'' ''నిరాశ పడకండి మామా!'' అన్నాడు తేంగి ''నేను సాధిస్తాను!''

ఆ రోజు సాయంత్రం ఆ వృద్ధుడు తన అల్లునికి మంత్రం బోధించి పని ఆరంభించటానికి కొంత డబ్బు కూడా ఇచ్చాడు.

ఆ మరుసటి రోజే తేంగి తన ఇంటికి దగ్గరలోనే ఒక చిన్న పొలం కొని దానిని చదును చేశాడు. మామ నేర్పినట్లే అతను తానే స్వయంగా నేలను త్రవ్వి మంత్రం చదువుతూ మొక్కలు నాటాడు. ప్రతిరోజూ పొలానికి వెళ్ళి ఆ మొక్కలను గమనించసాగాడు. కలుపు మొక్కలు ఏరివేసి చీడపీడలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు.

ఆ మొక్కలు పెరిగి పళ్ళు కాచినపుడు, అతను వెండి రంగు పొడిని ఆకులపైనుంచి సంగ్రహించి ఒక డబ్బాలో జాగ్రత్తపరచసాగాడు.



Scanned with CamScanner





Scanned with CamScanner

ఆకులపై పొడి చాలా స్వల్పంగా ఉండడంతో అది సరిపోదని తేంగి మరికొంత పొలం కొని మరికొన్ని అరటి మొక్కలు నాటి పెంచసాగాడు.

ఎంత కష్టమైనా సరే అతను కావలసినదాన్ని సాధించాలని నిర్ణయించుకున్నాడు. అతను అనేక సంవత్సరాల తరువాత కావలసినంత మహిమగల పొడిని సేకరించాడు.

వెంటనే మామగారి వద్దకు మునుపెన్నడూ లేని ఉత్సాహంతో పరుగెట్టి వెళ్ళాడు. త్వరలో అతను మట్టినుంచి బంగారం చేయగలడు!

''మామా... చిట్టచివరికి... ఇదుగో ఒక కిలో మహిమగల పొడి!'' అని బిగ్గరగా చెప్పాడు.

వృద్ధుడు సంతోషించాడు. ''అద్భుతం!'' అన్నాడతడు. ''అద్భుతం! నీవు గొప్ప పని చేశావు తేంగి. నేను నిన్ను చూసి గర్వపడుతున్నాను. నేనిప్పుడు మట్టినుంచి బంగారం చేసే విధానం చెబుతాను. కానీ మొదలు తూజను పిలుచుకురా. ఆమె సహాయం మనకు కావాలి.''



Scanned with CamScanner

తేంగి కొంచెం ఆశ్చర్యపడ్డాడు. కానీ సమయం వృధా చేయక వెంటనే భార్య దగ్గరకు పరుగెట్టుకుంటూ వెళ్ళి ఆమెను వెంటబెట్టుకుని వచ్చాడు.

''తూజా, నీ భర్త ఆకులనుంచి పొడి సేకరించే పనిలో ఉన్నప్పుడు నీవు అరటిపళ్ళతో ఏం చేశావు?'' అని అడిగాడు వృద్ధుడు.

''నాన్నా, నేను ఆ పళ్ళను అమ్మివేశాను'' అన్నది తూజ. ''ఆ విధంగానే కదా మేము జీవనోపాధి సంపాదించుకున్నాము?''

''అయితే నీవు కొంత సొమ్ము పొదుపు కూడా చేసి ఉండాలి. తేంగి అవసరమైన దానికన్నా ఎక్కువ అరటిపళ్ళు పెంచాడుగా..'' అన్నాడు వృద్ధుడు.

''అవును నేను పొదుపు చేశాను'' అన్నది తూజ.

''మనం చూడవచ్చా?'' అనడిగాడు థెట్.

''తప్పకుండా, నేను ఇంట్లో జాగ్రత్తగా దాచాను'' అన్నది తూజ ఆనందంగా నవ్వుతూ.



Scanned with CamScanner

ఆ ముగ్గురు తేంగి ఇంటికి వెళ్ళారు. అక్కడ తూజ అటక మీదినుంచి చాలా సంచులు దించింది. థెట్ ఒక సంచి తెరిచి చూసి ఆనందంగా నవ్వాడు. సంచీని ఒక బల్లపైన బోర్లించాడు. ధగధగ మెరుస్తున్న బంగారు నాణేలు ఒక పెద్ద కుప్పగా పడ్డాయి.

అతను పొలంలోకి వెళ్ళి కొంత మట్టిని తెచ్చి ఆ నాణాల కుప్ప ప్రక్కనే పోశాడు. ''నీవే చూడు తేంగి, నీవు మట్టిని బంగారంగా మార్చావు'' అన్నాడు అల్లుడివైపు చూస్తూ.

ఆ రోజు తరువాత తేంగి మరెప్పుడూ అరటి ఆకులపైని పొడిని సేకరించే పని చేయలేదు. కానీ అతను అరటిపళ్ళు పండిస్తూపోయాడు.

అతని ''రసవాది'' మామగారు అతనికి మట్టినుండి బంగారం తయారుచేసే మంచి మార్గం ఏమిటో ఒక గొప్ప పాఠం నేర్పాడు. అతనికి మహిమగల పొడి ఇంకా ఏనాడు అవసరం పడలేదు మరి.




Scanned with CamScanner





Scanned with CamScanner



## అరటితో మజా!

తేంగి అరటి ఆకుల నుంచి తీసిన మహిమగల పొడిలాగా మీ స్నేహితులను మీరు మహిమగల అరటిపళ్ళతో ఆశ్చర్యపరచవచ్చు! వారికి మీరు ఇపుడే కనుగొన్న క్రొత్తరకం అరటిపళ్ళ గురించి చెప్పండి - చెట్టు మీదే బిళ్ళలుగా కోసి ఉన్నట్లు పండే అరటిపళ్ళు.

## మీ మహిమగల అరటిపళ్ళను మీరే తయారు చేసుకోండి.


## మీకు అవసరమయినవి:

కొన్ని పండిన అరటిపళ్ళు

ఒక పంటి పుల్ల లేదా ఒక సూది.



Scanned with CamScanner





## తయారుచేసే పద్ధతి:

1. ఒక పంటి పుల్లను అరటిపండు మీది అంచుపై ఎక్కడైనా ఒకచోట గుచ్చి దూర్చండి.

2. పుల్లను బయటకు తీయకుండా రెండువైపులా మెల్లగా త్రిప్పుతూ పూర్తిగా పండులో కోత పెట్టండి. అరటితొక్కకు తగలకుండా జాగ్రత్త పడాలి సుమా! పుల్ల గుచ్చిన రంధ్రం ఎంత చిన్నగా ఉంటే అంత మంచిది.



Scanned with CamScanner




3. పుల్లను మెల్లగా తీసి ఒక అంగుళం దూరంలో మరొక సారి గుచ్చి పైన చెప్పిన విధంగా ఇంకొక కోత పెట్టండి. ఇలా పండు మొత్తం ఒక్కొక్క అంగుళం దూరంలో కోతలు పెట్టండి - కనీసం 5 లేక 6 ముక్కలు వచ్చే విధంగా.

అంతే - మీ మహిమగల అరటి పళ్ళు తినటానికి తయారు. మీ స్నేహితులను మీరు ఎలా ఇటువంటి కొత్త రకం మహిమగల పళ్ళను తోటలో కనుగొన్నారో కథలు చెబుతూ వారికి పంచండి. వారు తొక్క తీయగానే ముక్కలుగా ఉన్న పళ్ళను చూచి ఆశ్చర్యపోవటం గమనించండి. బాగుంది కదూ ఈ రుచికరమైన బనానా మ్యాజిక్!



Scanned with CamScanner